

ప్రముఖ సమాజ సేవకుడు సజ్జత్ హుస్సేన్ కుమార్తె వివాహం సన్ సిటీలో జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మైనార్టీ కమిషన్ చైర్మన్ తారక్ అండ్ సాలి, ఫారుక్ హుస్సేన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ ముజామిల్ అహ్మద్, రషీద్ ఖాన్, అఫ్జల్, తప జుల్, మోహిని దిన్ తదితరులు పాల్గొన్నారు. (బండ్లగూడ, ఫిబ్రవరి 9)

మధురానగర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు సినీ అండ్ టీవీ ఔట్ డోర్ యూనిట్ టెక్నీషియన్స్ యూనియన్

అవకతవకలపై విచారణ కమిటీ ఏర్పాటు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 9:తెలుగు సినీ అండ్ టీవీ ఔట్ డోర్ యూనిట్ టెక్నీషియన్స్ యూనియన్‌లో జరిగిన అవకతవకల విచారణకు కమిటీని నియమించినట్లు అధ్యక్షుడు కిషోర్ కుమార్ తెలిపారు. ఆదివారం మధురానగర్‌లోని ఎస్.రామకృష్ణరాజు కమ్యూనిటీ హాల్లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 1993 సంవత్సరంలో ఆవిర్భవించిన ఈ యూనియన్ లో 1800 మందికి పైగా సభ్యులున్నారు. జమ,ఖర్చుల్లో అవకతవకలపై ఫిర్యాదులు రావడంతో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కలగర సుధీర్, మురళీమోహన్, కేశవరెడ్డి ఉరఫ్ సి.సి.రాజు, బొంగు నగేష్, నాగరాజులకు చోటు దక్కింది. 45 రోజుల్లో కమిటీ నివేదిక ఇవ్వనుందని..నిజానిజాలు నిగ్గు తేలుతాయని ఆయన పేర్కొన్నారు.

నేడు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9: చిలకలగూడ, భవానినగర్ లో నేడు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ హేమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మూసీ ఒడ్డున ఇటీవల ఏర్పాటు చేసిన నర్సరీలు, మూసీ ఒడ్డున లారీలకు అడ్డాగా చేసుకుని కొనసాగిస్తున్న వ్యాపారం

మూసీని మూసేయ్....వ్యాపారం చేసుకో..

- మూసీ నదిఒడ్డున రాత్రికి రాత్రే వెలుస్తున్న వ్యాపారాలు
- పత్తా లేని మూసీ సంరక్షణ అధికారులు

బండ్లగూడ, ఫిబ్రవరి 9: ప్రభుత్వ స్థలాలు,నాలాలను కాపాడే బాధ్యత తమదే అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీని పట్టించుకోకుండా పోతుంది.మూసీ అభివృద్ధి పేరుతో నానా హంగామ చేసిన అధికారులు.. ఇప్పుడు పత్తా లేకుండా పోయారు. మూసీ అభివృద్ధి పేరుతో ఇటీవల మూసీ ఎఫ్‌టీఎల్ జోన్ పరిధిలో ఉన్న అనేక కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించి వారి ఇండ్లను కూల్చి వేసిన విషయం తేలిసిందే.అంతే కాకుండా మూసీ బఫర్ జోన్లను కూడా గుర్తించి వదిలేసింది.ఇదిలా ఉంటే కొన్ని రోజులుగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ బ్రిడ్జి నుంచి మొదలు కొని ఉన్న మూసీ, కిస్మత్‌పూర్ వరకు ఉన్న ఈసీ నది పరీవాహక ప్రాంతంలో రోజు ఏదోఒక రూపంలో మూసీ, ఈసీ నదులు కబ్జాలకు గురవుతున్నాయి.మూసీ వెంట అనేక వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి.రాత్రికి రాత్రే మట్టి కుప్పలు మూసీలో పోసి చదును చేస్తున్నారు.అంతే కాదు వాటిపై ఎర్రటి మట్టి పోసి నర్సరీలు, కొబ్బరిబోండ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు.లారీల అడ్డా చేసి అమ్మకాలు కొనుగోలు చేస్తున్నారు.ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులతో పాటు మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు సైతం పత్తా లేకుండా పోయారు. ఈ విషయమై స్థానిక ప్రజలు సంబంధిత విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు ఆ స్థలంలో వ్యాపారాలను ఏర్పాటు చేసి లాభాలను అర్జిస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

50 గజాల స్థలంలో భవన నిర్మాణం

20 ఏళ్ల క్రితం 50 గజాల స్థలంలో నిర్మించిన ఇంటిపై ఇటీవల అక్రమంగా ఆరంతస్తులు నిర్మిస్తున్న యజమానికి జీహెచ్ఎంసీ నోటీసు అందజేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న ఓ బస్తీ నేత 20 ఏళ్ల క్రితం జీ ప్లస్ వన్ భవనాన్ని నిర్మించాడు. కాగా ఇటీవల ఆ భవనంపై మరో ఐదు అంతస్తులు నిర్మిస్తున్న విషయంపై స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పాత ఇంటి మీద అత్యంత ప్రమాదకరంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తుల వల్ల ప్రమాదం పొంచి ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాన్ని ఎందుకు కూల్చివేయరాదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేశారు.
– బంజారా హిల్స్, ఫిబ్రవరి 9:

న్యాయవాదుల కోసం రక్షణ చట్టం తీసుకురావాలి

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్‌లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలోని న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనాలు, లైబ్రరీ ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం బడ్జెట్ లో నిధులు కేటాయించి, హైకోర్టులో న్యాయమూర్తుల నియామకంలో న్యాయవాదుల కోటా నుంచి భర్తీ చేయాలని భర్తీ చేయాలని కోరారు. న్యాయవాదులపై దాడికి పాల్పడే వారికి సకాలంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దూస్స జనార్దన్, న్యాయవాదులు ఉదయ భాస్కర్, భీమ నాథ్ శ్రీనివాస్,మల్లేపల్లి ఆదిరెడ్డి, కేవి ఎల్, రాములు లతీఫ్, గణేష్,బత్తిని రాము, అనిత, ఉత్తమ్ కుమార్,సుభాష్, జయ శ్రీనివాస్, వెంకటేశం గుర్రం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌదుపు సంఘాలకు ప్రైవేట్ బ్యాంకుల రుణాలు

యూసుఫ్‌గూడాలో ఐసీఐసీఐ బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకీయా సుల్తానా

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9: మహిళా సాధికారితకు ప్రైవేట్ బ్యాంకులు సహకారం అందించనున్నాయి. యూసుఫ్‌గూడా సర్కిల్‌లో పొదుపు సంఘాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఐసీఐసీఐ బ్యాంక్ ముందు కొచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ల రుణ సదుపాయాలతో స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ కుటుంబ పోషణలో కీలక భూమిక పోషిస్తున్న పొదుపు సంఘాల మహిళలకు ప్రైవేట్ బ్యాంకుల నుంచి కూడా ఆర్థిక సహాయం అందించేందుకు ఏ ర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జీ హెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకీయా సుల్తానా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు, పొదుపు సంఘాల అధ్యక్షులు, రిసోర్స్ పర్సన్‌లకు బ్యాంక్ ఖాతాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జాకీయ సుల్తానా మాట్లాడుతూ.. ప్రైవేట్ బ్యాంకు లు పొదు పు సంఘాలకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అ న్నారు. యూసీడీ డీపీవో వెంకట కిషన్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ బ్యాంకుల రుణా లు ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం అమలుకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతకు కృషి చేయాలి

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ బీసీ నాయకులు రావులకోల్ల నాగరాజు, రాముడు

బండ్లగూడ, ఫిబ్రవరి 9; బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీసీల కోసం కృషి చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజుకు సూచించారు. ఆదివారం బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన బీసీ నాయకుల ముఖ్య సమావేశంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరళివెళ్లారు. అనంతరం నాగరాజు, కార్మిక సంఘం నాయకుడు రాముడు యాదవ్ కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు కృషి చేయాలని కేటీఆర్ బీసీ నాయకులకు సూచించారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 9: ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చిలకలగూడ చౌరస్తా వద్ద కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేసుకున్న వాహనాలను గుర్తించి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. నిబంధనలను పాటించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

కాటేదాన్‌లో అగ్నిప్రమాదం

ప్రమాదవశాత్తు ఓ ప్లాస్టిక్ పరిశ్రమలో మంటలు చిలరేగాయి. ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేశారు. నిమిషాల వ్యవధిలో మంటలు భారీగా ఎగిసి పడి దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు భయాందోళన గురయ్యారు. విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9:

దివ్యాంగులకు ఉచిత బస్సుపాసులు అందజేత

పిల్లోనిగూడ గ్రామంలో దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులను అందజేస్తున్న జుర్కి రమేష్, తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : దివ్యాంగులకు ఉచిత బస్సుపాసులను అందజేశామని నాయకులు తెలిపారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడ,కవ్వగూడ, చౌదర్‌గూడ నర్కూడ, నానాజీపూర్ గ్రామాలలోని దివ్యాంగులకు ఆర్టీసీ అధికారి రాజు సహకారంతో అందజేశామని వారు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జుర్కి రమేష్, కే విష్ణు, విరచారి, కిట్టు,కిష్టయ్య,మల్లేష్, లింగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

సమైక్య భవన్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఐ నాగరాజు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9: సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ తుమ్మలబస్తీలోని సమైక్య భవన్ కమ్యూనిటీ హాల్లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజేంద్ర కుమార్, ఖైరతాబాద్ ఎస్సై నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ సహకారంతో చేపట్టిన ఈ వైద్య శిబిరంలో 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటి నాగేశ్వర్ రావు, అబ్దుల్ సత్తార్, సభ్యులు ఆయూబ్ ఖాన్, పూస భరత్. పి. మహేశ్, సదాక్ అలీ, తేజ, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంచేందుకు కృషి

శివకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అనిల్ కుమార్

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 9: సమాజంలో ఆధ్యాత్మిక భావం పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం నూతన వైస్ చైర్మన్ జిల్లా శివ తెలిపారు. చిక్కడపల్లిలోని ఆర్టీసీ ఎక్స్ రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంకు వైస్ చైర్మన్‌గా హిమాయత్ నగర్ డివిజన్‌కు చెందిన శివ నియమితులయ్యారు. ఆదివారం శివకు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు.

కరాటేలో సత్తా

యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మహేంద్ర హిల్స్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ.. ఇండివిజువల్ కటా, కుమితి విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన చిన్నారిని కరాటే మాస్టర్ కుమార స్వామి అభినందించారు. జూబ్లీహిల్స్

సమస్యల పరిష్కారానికి కృషి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 9: డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. స్కైలాబ్ హోటల్ సమీపంలో మంచి నీటి, మురుగు సమస్య తరచూ తలెత్తుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆదివారం కార్పొరేటర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో మురుగు, మంచినీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలియజేశారు.

రాష్ట్రంలో సైకాలజిస్ట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్ రెడ్డి భవన్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాం చందర్

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో సైకాలజిస్ట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు సైకాలజిస్టుల పాత్ర ఎంతో అవసరమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో నెలకొనే భయాందోళనను పోగొట్టేందుకు సైకాలజిస్టులు కృషి చేయాలన్నారు. ప్రతి సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఒక శక్తిగా ఎదిగి సమాజానికి మరిన్ని సేవలు అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. సైకాలజిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శ్రీ పూజ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ. సుధాకర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, నాయకులు శ్రీధర్, విశాల, రాధా రాణి,రోజా సతీష్, సోనాలి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం అందజేత

ఆరాంఘర్ ప్రాంతంలో నిరుపేదలకు అల్పాహారం అందజేస్తున్న మానవ సేవే మాధవ సేవా సంస్థ ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9 : పేదలను ఆదుకునేందుకు తమవంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మానవ సేవే మాధవ సేవా సంస్థ ప్రతినిధి ఏర్వకుమారస్వామి, రమేష్‌రెడ్డిలు వెల్లడించారు. ఆరాంఘర్‌లోని పేదలకు అల్పాహారం అందజేశారు. దాతలు జ్యోతి, మంజుల, అనిత, సునీతశర్మ, దినేష్‌రెడ్డిల సహకారంతో పేదలను ఆదుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవలో భాగస్వామ్యం అయ్యేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారన్నారు. వారికి తోచిన సహాయ సహకారాలు అందిస్తు పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు చేసి పేదలకు భరోసా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి జగదీష్, గొంత్యాల శ్రీనివాస్, దినేష్‌రెడ్డి, గౌరీ, ప్రేమ, దేవి తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన నట్టల నివారణ మందుల పంపిణీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9: నేషనల్ డీ వార్మింగ్ డేను పురస్కరించుకుని నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించనున్న ఎన్‌డీడీ కార్యక్రమం వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. బాల్యం దశలో రక్త హీనత నివారణకు 1–19 ఏండ్ల చిన్నారులు, విద్యార్థులకు ప్రతి ఏడాది 2 మార్లు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారు. దీనిలో భాగంగా నేడు ఆ ల్బెండోజోల్ టాబ్లెట్‌లు మొదటి రోజు వేయించుకోలేని విద్యార్థులకు మరుసటి సోమవారం మాప్ అప్ డే నిర్వహిస్తారు. కాగా సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమ తదుపరి తేదీని అధికారులు ప్రకటించాల్సి వుంది.

అక్కా అంటూనే..కూతురిపై దాడి

సాయం చేస్తున్నట్లు నటించి కాటేశాడు

–యువతిపై అత్యాచారం చేసిన కామాంధుడు

బంజారాహిల్స్ , ఫిబ్రవరి 9:ప్రేమించిన వాడితో పెళ్లి జరిగేలా చూస్తానంటూ నమ్మించిన ఒక కామాంధుడు యువతిపై దారుణానికి ఒడిగట్టాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై మద్యం మత్తులో అత్యంత పాశవికంగా అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నీకే నష్టం అంటూ బెదిరింపులకు దిగాడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ పరిధిలోని ఓ బంగ్లాలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న దంపతులకు ఓ కుమార్తె (19) కుమారుడు (17) ఉన్నాడు. వారు పని చేస్తున్న భవనం యజమాని సంస్థలో మోతీనగర్‌కు చెందిన భక్తుల శివ నరసింహ (31) అనే వ్యక్తి కార్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. ఒకే చోట పనిచేస్తుండడంతో నాలుగేళ్లుగా వాచ్‌మెన్ కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు వాచ్‌మెన్‌తో కలిసి మద్యం సేవించడంతోపాటు వాచ్‌మెన్ భార్యను అక్కా అని పిలుస్తూ ఇంటి మనిషిలాగా ఉండేవాడు. ఇదిలా ఉండగా ఇంటర్ పూర్తి చేసిన వాచ్‌మెన్ కుమార్తె రెండేళ్ల క్రితం ఓ ప్రైవేట్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగంలో చేరింది. అక్కడ పనిచేస్తున్న ఓ యువకుడితో ప్రేమలో ఉంది. అయితే ఇటీవల సదరు యువకుడికి ,యువతి మధ్య విభేదాలు రావడంతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో వారిద్దరి మధ్య రాజీ కుదిర్చి పెళ్లి జరిగేలా చూస్తానంటూ యువతితో డ్రైవర్ శివ నమ్మబలికాడు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం యువతి తండ్రి పనిమీద వేరే ఊరికి వెళ్ళాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో శివ వాచ్‌మెన్ ఇంటికొచ్చి తాను తెచ్చుకున్న మద్యం సేవించాడు.

అనంతరం వాచ్‌మెన్ కొడుకు నైట్ డ్యూటీ కోసం వెళ్లిపోగా, శివ కూడా వెళ్లిపోయాడు. వాచ్‌మెన్ భార్య తన గదిలోకి వెళ్లి నిద్రపోగా కుమార్తె పక్క గదిలో నిద్రించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత యువతి గదిలోకి వచ్చిన శివ ఆమె ముఖాన్ని దిండుకు అదిమి అత్యంత కిరాతకంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, నీ ప్రియుడితో పెళ్లి చేయించే బాధ్యత నాదే అంటూ బెదిరించాడు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబితే తట్టుకోలేరని భావించిన యువతి రెండ్రోజుల పాటు తనలోతానే కుమిలిపోయింది. ఈ విషయాన్ని శనివారం రాత్రి గుర్తించిన తల్లి కూతురిని నిలదీయడంతో జరిగిన దారుణం బయటపడింది. ఆమె ఒంటి మీద గాయాలు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతీ ఇచ్చిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు బత్తుల శివ నరసింహపై బీఎన్ఎస్ 64 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు శివ నరసింహ కోసం గాలింపు చేస్తున్నారు.

స్వలింగ సంపర్కుల యాప్ ద్వారా రప్పించి..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: యాప్ ద్వారా పరిచయం చేసుకొని స్వలింగ సంపర్కులను తన వద్దకు రప్పించుకుని బ్లాక్‌మెయిల్ ద్వారా డబ్బులు కాజేస్తున్న యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే పాతబస్తీలోని డబీర్‌పురకు చెందిన ఫర్హాన్ బేగ్ (25) అనే యువకుడు కొంతకాలంగా పలు రకాలైన స్వలింగ సంపర్కుల యాప్‌ల లో తన పేరు నమోదు చేసుకున్నాడు. తాను స్వలింగ సంపర్కుడిని అంటూ నమ్మించి ఆసక్తి గల వారికి వల వేస్తున్నాడు. ఈ క్రమంలో యాప్ ద్వారా ఒక గే యువకుడితో (22) ఇటీవల చాటింగ్ చేసిన ఫర్హాన్ బేగ్ కలుసుకుందాం రమ్మంటూ పిలిచాడు. టోలిచౌక్ సమీపంలోని జైహింద్ నగర్‌లో నిర్మానుష్య ప్రాంతానికి వచ్చిన గే యువకుడు దగ్గరికి వచ్చి చేతులు వేయగానే ఫర్హాన్ అతడిని ఫొటోలు, వీడియోలు తీయడం ప్రారంభించాడు. తాను గే కాదని, నీ ఫొటోలు వీడియోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించి బ్లాక్‌మెయిల్ చేశాడు. రూ 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు తన వద్ద రూ. 10వేలు మాత్రమే ఉన్నాయంటూ ఫోన్ పే ద్వారా ఫర్హాన్ బేగ్ అకౌంట్‌కు డబ్బులు పంపించిన యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నిందితుడు ఫర్హాన్ బేగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏబీసీడీ వర్గీకరణతో .. ఎన్నికలు నిర్వహించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు నిర్వహించబోయే ఎన్నికల్లో ఏబీసీడీ వర్గీకరణతో నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ, బహుజన కమ్యూనిస్టు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో ఎంబీసీ కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ ఎ జాబితాలోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరుగలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కులగణన నిర్వహించి స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ కులాలకు రిజర్వేషన్ అమలు చేయబోతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు.